# ౨౧

## చలో ఢిల్లీ
## అంటే సరే పదండి!

"ఏమేవ్ —

ఒసేయ్!

ఓసి పీనుగా —

ఇదుగో ....నిన్నే.

ఏయ్ ....

తలుపూ,

మనిషి!"

అంటూ ఇన్నికాలుగా ఆడదాన్ని హీనంగా పిలిచే పల్లెటూర్లో మొట్టమొదటి సారి మీరు నన్ను పేరెట్టి పిలిచారు.

నా కెంత సంతోషం వేసిందని?— మొగుడి త రోజూ దెబ్బలు తినే నా స్నేహితురాళ్ళంతా "నీ మొగుడు నిన్న పేరెట్టి పిలుస్తాడే సీతా!" అంటూ నన్ను సింహాసనం ఎక్కించారు. మీరు నన్ను ఎన్నిమార్లు పేరెట్టి పిలిస్తే నాకంత పెద్ద గొప్పగా వుండేది. మా ఊళ్లో ఫస్టుఫారం ప్యాసయిన ఏ అమ్మాయికీ ఉత్తరాలొచ్చేవికావు. మా జగన్నాధపురంలో నరసాపురం కాలువ గట్టున "పోస్టుమాన్ సైకిల దిగి మా గుమ్మంలో కొచ్చి నా పేరెట్టి పిలిచి మరీ ఉత్తరాలిస్తుండేవాడు. కాలవకు బిందెలు చంకన పెట్టుకుని కళ్ళు గుడ్డలు ఉతుక్కొని. మడినీళ్లు తెచ్చుకునే ఆడవాళ్ళంతా "మొగుడికి ఉత్తరాలు రాసే రౌడీ" కింద నన్ను చూసేవారు. నేను అప్పుడప్పుడు కారాకిళ్ళీలు కూడా వేస్తాను. గనుక మానాన్న "సీతిగా!"—"ఒరేయ్ రౌడీ" అని పిలుస్తుంటే ఆపనువును చూసుకుని నేను మా అమ్మని ఏడిపించుకుతినేదాన్ని. మా నాన్నకు మొగపిల్లలు పుట్టడం చావడం పుట్టడం చావడం. ఎవరూ బతక్కపోయే సరికి నన్నే ఆడ పిల్లా. మొగపిల్లా పెట్టి ముద్దుగా పిలుచుకునేవాడు. చిరుతిళ్ళకి. సరదా ఖర్చుల క్రింద ఎంత డబ్బు తగలేసేదాన్నో — మొత్తానికి నేను మా యింట్లో ఒకర్తెనే కావడం చేత గారాబంగా పుట్టి పెరిగాను.

మా ఊళ్లో ఫస్టు లవ్ లెటర్ మొగుడికి రాసిన అమ్మాయిని నేనే!

లోపల పరికిణీ వేసుకుని చీరకట్టడం మొదలెట్టిన దాన్నినేనే!

చెప్పులు వేసుకుని రోడ్డుమీద మొగుడితో నడిచివెళ్ళి కుర్చీలో మొగుడి ప్రక్కన కూర్చుని సినిమా చూసినదాన్ని నేనే!

మొగుడు పలకరిస్తే మాట్లాడితే తప్పు పట్టుకునే పల్లెటూళ్లో పెరిగిన నన్ను ఏకాఏకీ తీసికెళ్ళి పడేశారు. మీరు యమునా తీరాన.

చలో ఢిల్లీ! అంటే సరే పదండి అన్నాను నేను. ఏం ఊరో బాబూ....ఊరంతా గోరీలు, స్మశానాలు! ఆ సైకిళ్ళేమిటండి-సైకిలు మీద కుటుంబాలు కుటుంబాలు ప్రయాణం చేస్తారు. పులినిచూచి నక్క వాత పెట్టుకున్నట్టు వాళ్ళని చూసి మీరు నాకు సైకిలు తొక్కటం నేర్పుతానన్నారు. వద్దు బాబూ అంటే మీరు ఊరుకోలేదు. భారతస్త్రీ ముందంజ వెయ్యాలి: నారీ లోకం సంకెళ్ల త్రెంచుకుని కిటికీలు తలుపులు. గోడలు పడగొట్టి ముందుకు రావాలి అంటూ ఓ ఆడ సైకిలు తెచ్చి "తాల్ కటోరా గార్డెన్సుకి నన్ను లాక్కెళ్లారు. అక్కడంతా వెర్రి మొర్రి పనులు చేసేవాళ్లే పోగయారు. పెళ్లాలకి సైకిలు నేర్పేవాళ్లు. కారు డ్రయివింగు నేర్పే వాళ్లూ. పరుగులు పెట్టేవాళ్లూ. వీళ్ళందరినీ చూస్తోంటే దమ్మిడీకి పనికొచ్చేవాడొక్కడూ నాకు కనపడలే! అక్కడో చింతచెట్టు కనిపిస్తే నాకు ప్రాణం లేచివచ్చింది. చింత చిగురు పప్పు వండుతాను చింత చిగురు కోయమన్నాను. మీరు సైకిలు అద్దెకు తెచ్చినా నేను సైకిలు నేర్చుకోడానికి ఉత్సాహం చూపక పోయేసరికి మీరు పళ్లు పటపటా పిండుకున్నారు. నేను చింతచెట్టు కింద వెళ్ళి నిలబడి కర్రతో చింత చిగురు కొడుతూంటే ఆడసైకిలు కేసి మీరు చింత నిప్పులు చెరుగుతూ చూస్తున్నారు. ఆ వేళ నేను సైకిలు ఎందుకు నేర్చుకోలేదంటే మీరు పట్టుకోలేక వదిలేస్తే పడిపోతానని. అలా పడిపోతే మళ్ళీ ఇంటిల్లిపాదికీ చాకిరీ వంటా-పెంటా తప్పుతుందా-అంచేత-నాకున్న భయాలు నావి. నేను అంతకుముందు పెళ్లాలకి సైకిలు తొక్కడం నేర్పడంచేత కాక కిందా మీదాపడి కాళ్లూచేతులు విరుచుకున్న వాళ్ళను చూశాను. ఏ సైకిలు ఎడ్వర్టయిజ్‌మెంటు చూసి మీకు మతిపోయిందో అనుకున్నాను. ఆ వేళ చింతచిగురు పప్పు మరీ మరీ అడిగి అడిగి వేయించుకు తిన్నారు. మీ ఫ్రెండు రామేశంగారు కూడా "నీ వైఫ్ చింత చిగురు పప్పు చాలా బ్రిలి

యంట్‌గా చేస్తుందిరోయ్ అని అన్నారు. అవునండీ ఏవన్నా బాగుంటే అలా వేళ్లు నాకుతూ తిండం చూడ్డానికి నాకు అసహ్యం బాబూ! వేళ్ళు నాక్కుంటూ తింటూంటే వాళ్ళను రెండు మొట్టికాయలు మొట్టాలని పిస్తుంది. అదోటి-చేతులు కడుక్కున్నాక లుంగీతో మూతి తుడుచుకోవడం-అబ్బ! ఈ రెండు దురలవాట్లూ మీ చేత మానిపించలేకపోయాను.

ఢిల్లీలో మీరు కష్టపడ్డారు నన్ను కష్టపెట్టారు. బస్సు డబ్బులు లేక మీరు మోతీబాగ్ నుంచి స్టేట్ ఎంట్రీరోడ్డు దాకా నడిచివెళ్ళి మళ్ళీ సాయంత్రం. ఆలిండియా రేడియో సెక్రటేరియట్, తీన్‌మూర్తి, అశోకా హోటలు మీదుగా చాణక్యపురి దాటి ఇంటికి నడిచి వచ్చారని వినగానే నాకు ఏడుపు ఆగేదికాదు. వెక్కి-వెక్కి ఏడ్చి ఫిట్‌వచ్చి పడిపోయేదాన్ని. మీలా ఇంటికి నడిచి వచ్చే డబ్బులులేనివాళ్ళను పదకొండో నెంబరు బస్సు గాళ్లని అంటారని ఎవరో అంటే ఆరోజుల్లో నేను ఏడ్చాను. ఈ చేత్తో కూరలు ఆ చేత్తో సామానులు కదలడానికి లేకుండా బస్సుస్టాండు నుంచి ఇంటిదాకా సరుకులు మోసుకుంటూ వచ్చే మిమ్మల్ని చూడగానే నాకు చెప్పలేని జాలి వేసేది.

నెహ్రూగారు తీన్‌మూర్తి దగ్గర బయలుదేరే టైముకు రోజూ కాలి నడకను మీరూ రోడ్డు దాటుతుండేవారని, చెప్పారు నాతో. బస్సుడబ్బులులేని నా మొగుడూ. భారత ప్రజల హృదయాభిషాసమూర్తి ఒకే రోడ్డు మీద రోజూ ఒకే సమయంలో కలియడం ఎంత చిత్రం? పదకొండో నెంబరు బస్సుగాడన్నపుడు కలిగిన దుఃఖం మరుక్షణమే ఆనందబాష్పాలుగా మారి నా పమిటచెంగును తడిపేవి.